క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర ఆలయంలో అలంకరించబడిన స్వామివారు

బలిజిపేట: బలిజిపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు హరి ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకుడు సురేష్ స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారిని తులసిదళాలు, మందార పువ్వులతో అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. స్వామివారికి తులసి దళాలను భక్తులు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో సీఆర్టీల రెన్యువల్ ఆర్డర్లపై నిర్లక్ష్యం

పార్వతీపురం టౌన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు రెన్యువల్ ఆర్డర్లు ఎప్పుడు ఇస్తారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళి మోహనరావు అధికారులను ప్రశ్నించారు. సీఆర్టీలను రెన్యువల్ చేసేందుకు రాష్ట్ర అధికారులు 20 రోజుల క్రితమే ఉత్తర్వులు ఇచ్చారని అయినా ఆలస్యం దేనికని పేర్కొన్నారు. గత సంవత్సరం పని చేసిన సీఆర్టీలందరిని, రెన్యువల్ చేయాలని అన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం సీఆర్టీలను డీఎస్సీ నుంచి మినహాయించాలని కోరారు. పాఠశాలలు తెరిచి నెల రోజులైనా.. ఉత్తర్వులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి రెండు రోజుల్లోగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యువకునికి గాయాలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ యువకుడు తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో కర్షక మహర్షి ఆస్పత్రి జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి వేచి ఉండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఇరువురు మధ్య వాగ్వివాదం జరిగి కొట్లాటకు దారితీసింది. గాయపడిన వ్యక్తిని పార్వతీపురం కేంద్ర ఆసుపత్రిలో చేర్చినట్లు ఔట్ పోస్టు ఏఎస్ఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు వివరాలు సేకరించామన్నారు.

చెట్టు పైనుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

పార్వతీపురం రూరల్: కొబ్బరి కొమ్మల నిమిత్తం చెట్టు ఎక్కిన గరుగుబిల్లి గ్రామానికి చెందిన చోడవరపు వెంకటరమణ అనే యువకుడు ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటరమణ జారిపడిన సమయంలో స్థానికులు ఎవరూ ఆ సమయంలో లేకపోవడంతో ఆలస్యంగా గుర్తించిన వారు ఇంటికి తరలించారు. అక్కడ నుంచి పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఔట్‌పోస్టు ఏఎస్ఐ ఎస్.భాస్కరరావు వివరాలు సేకరించారు.

సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి

సాలూరు: మండలంలోని బాగువలస గ్రామంలో జెడ్పీహెచ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. వీకే యూనివర్సల్ ఫ్యామిలి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటువంటి సంస్థలు విద్యార్థులు అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమైందన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పిస్తా...



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి

సీతానగరం: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు విద్యా బోధనలకు అవసరమైన అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని, బాగా చదువుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా మండలంలోని జోగింపేట డాక్టర బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే విజయచంద్రతో కలిసి శనివారం సందర్శించారు. వసతిగృహం, విద్యాలయ ప్రాంగణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన వసతి కల్పించడానికి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త రూపావతి, ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కియోస్క్ సేవలు కనుమరుగు!

- వాటి స్థానంలో యాప్‌ల ద్వారా అవస్థలు
- కొత్త యాప్‌తో అరకొరగా సేవలు
- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా కియోస్క్‌లు





రైతు సేవా కేంద్రం, (ఇన్‌సెట్లో) రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రాలు

పార్వతీపురం రూరల్:

రైతులకు అందుబాటులో సేవలను అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ మిషన్లను ఏర్పాటు చేసింది. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు పంటలకు అవసరమైన సస్యరక్షణ చర్యలను వివరించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కియోస్క్ మిషన్లను పూర్తిగా ఉపయోగించకుండా నిర్వీర్యం చేసేలా కార్యాచరణ చేసింది. ప్రధానంగా ఈ కియోస్క్ ద్వారా వ్యవసాయ సమాచారం, బీమా వివరాలు, పంట రిజిస్ట్రేషన్, మార్కెట్ ధరలు, సబ్సిడీలు వంటి ప్రత్యేక సేవలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం వాటి వినియోగం లేకుండా నిరుపయోగంగా మూలకు చేరి రైతు సేవా కేంద్రాల్లో దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి రైతులకు మేలు చేసేందుకు గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటికి, వాటి నుంచి పొందే సేవలకు గుర్తింపు లేకుండా చేసేందుకు వాటితో పని లేకుండా యాప్‌లను సిద్ధం చేసి కియోస్క్‌లను నిరుపయోగంగా మూలకు చేర్చేలా చేసింది. దీంతో రైతులకు సక్రమంగా సేవలందకపోవడమే కాకుండా రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన వీటికి ఖర్చు పెట్టిన ప్రజా ధనం వృథా అయ్యిందని ప్రజలు వాపోతున్నారు.

● ఒక్కొక్కటిగా సేవలు ఎత్తివేత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలతో పాటు రైతన్నలకు నేరుగా సేవలను చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వలంటీరు వ్యవస్థ, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు నిర్వహించి ఇళ్ల వద్దకే సేవలందించి సచివాలయ వ్యవస్థ ద్వారా 540 పైగా సేవలు అందించేది. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 10 నుంచి 12 విభాగాల మేరకు 20కు పైగా ప్రత్యేక సేవలను అందించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం నిర్వాకంతో రానురాను సేవలు కనుమరుగవుతున్నాయి.

యాప్ ద్వారా సేవలు



గతంలో కియోస్క్‌ల ద్వారా ప్రస్తుతం మొబైల్ ఫోన్లలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు వాడుతున్న ఆండ్రాయిడ్ యాప్ ద్వారా సేవలందుతున్నాయి. ఏవైనా కియోస్క్‌లో ఉండి యాప్‌లు లేని సేవలైతే వాటి పరిష్కారానికి తక్షణమే సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న యాప్‌లోనే రైతుల యొక్క వివరాలు పొందుపరచడం, విత్తనాలు, ఎరువులు తదితర సేవలకు సంబంధించి వివరాలను కూడా పొందుపరుస్తున్నాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖాధికారి, పార్వతీపురం మన్యం

కొనసాగితేనే బాగు..



రైతులకు పంటల పరంగా, విత్తనాలు, ఎరువులు, బీమా, అన్నదాత సుఖీభవ, భూసార పరీక్షలు, వ్యవసాయంలో మెలకువలు ఇలా ఎన్నో సేవలు, సమస్యలు, వాటి పరిష్కారాలు గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలందేవి. ప్రస్తుతం అలాంటి దాఖలాలు కన్పించడం లేదు. విత్తనాల పంపిణీ, అరకొరగా ఎరువుల పంపిణీ వంటి కార్యక్రమాలు తప్ప రైతు మేలుకోరి గత ప్రభుత్వం మాదిరిగా చేసే సంస్కరణలుగాని, సంక్షేమ కార్యక్రమాలుగాని కానరావడం లేదు. ఏ ప్రభుత్వం మంచి చేసినా కొనసాగించాలే తప్ప ఈ విధంగా సేవలకు ఆటంకం కలించేలా కార్యాచరణలను రూపొందించడం సమంజసం కాదు.

– ఉరిటి అచ్యుతనాయుడు, కొత్తపట్నం, పార్వతీపురం మండలం

ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆదుకోవాలి

సీతానగరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక చక్కెర కర్మాగారాన్ని తెరిపించకపోగా కర్మాగారంలో అతి విలువైన ముడి సరుకు చోరీకి గురవుతున్నా పట్టించుకోలేదని గుర్తింపు యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాల కోసం, జీవనోపాధి, వాణిజ్య పరంగా అభివృద్ధి చెందడానికి, ఈ ప్రాంత రైతులకు ఆర్థికంగా ఉపయోగ పడేందుకు లచ్చయ్యపేటలో చెక్కర కర్మాగారాన్ని నిర్మించారు. ఆర్థికపరమైన కారణాలను సాకుగా చూపిన ఎన్‌సీఎస్ యాజమాన్యం దీన్ని మూసేసింది. ఈ క్రమంలో కర్మాగారంలో దీర్ఘ కాలంగా ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ చేసిన వారికి ఏళ్లు గడుస్తున్నా రావాల్సిన పీఎఫ్, గ్రాడ్యుటీ, బకాయి జీతాలు ఇంత వరకు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని యాజమాన్యంపై ఒత్తిడి చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. పాలకులు తమను ఆదుకుంటామని ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ఉద్యోగ విరమణ చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ సుగర్స్‌ను ఆనుకుని ఉన్న కోజెన్ పవర్‌ప్లాంట్‌లో ఇదివరలో రూ.2కోట్ల విలువైన మెయిన్ ట్రాన్స్‌ఫారంలో విలువైన సామగ్రి చోరీకి గురయ్యాయని, దీనిపై పోలీసులకు యాజమాన్యం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అయినా ఎటువంటి చర్యల్లేవని యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. చోరీల నివారణకు అడ్డుకట్ట వేసి, ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆదుకోవాలని యూనియన్ నాయకులు బీఏ రావు, ఎస్.కొండలరావు కోరారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించేనా..!

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పాలక వర్గ సమావేశం నాలుగేళ్లుగా నిర్వహించకపోవడంలో అంతర్యమేమిటని కాంగ్రెస్ ఓబీసీ నాయకులు వి.దాలినాయుడు అధికారులను ప్రశ్నించారు. శనివారం ఆయన మాట్లాడుతూ గిరిజనాభివృద్ధిపై పాలకులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారన్నారు. పాలకులు అధికారం చేపట్టాక గిరిజనులను పట్టించుకొనే దాఖలాలు లేవన్నారు. కేవలం గిరిజనుల ఓట్లను పొందేందుకు సవతి తల్లి ప్రేమను చూపిస్తూ పాలకులు పబ్బం గడుతుపుతున్నారన్నారు. పాలక సమావేశాలు నిర్వహిస్తే ఐటీడీఏలో జరిగిన అవకతవకలు, అవినీతి బయట పడుతుందనే ఉద్దేశంతో సమావేశాలు నిర్వహించడం లేదని ధ్వజమెత్తారు. గిరి వెలుగు ఏపీడీపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కనీసం దర్యాప్తును కూడా నిర్వహించలేదన్నారు. గిరిజన ఉద్యోగాలను గిరిజనేతరులు అనుభవిస్తున్నా చర్యలు లేవన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితరవి అందక అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆయనతో పాటు కె.రవికుమార్, టి.గౌరీశంకరరావు తదితరులున్నారు.

గిరిజనుల దాహార్తిని తీర్చండి : సీపీఎం

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో సరైన రీతిలో తాగునీరు సరఫరా లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని పార్వతీపురం మండల సీపీఎం నాయకుడు పి.రాము అన్నారు. గంగాపురం పంచాయతీ పనసభద్ర గ్రామంలో శాంక్షన్ అయ్యి ఏడాది గడుస్తున్నా పనులు పూర్తి కాక ప్రత్యామ్నాయంగా బోరు కూడా ఏర్పాటు చేయక మంచినీటి కోసం అవస్థలు పడాల్సి వస్తుందని ఆయనన్నారు. ఇంటింటికి కుళాయి పాయింట్లు ఇచ్చి వాటిని పూర్తి చేయకుండా అలాగే వదిలేశారని, గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో తాగునీటిని పుష్కలంగా గిరిజనులకు అందించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏడాది పాలన గడచినప్పటికీ గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యలు రోజురోజుకి తీవ్రతరం అవుతున్నాయన్నారు. సందివలసలో ట్యాంకు పనులు పూర్తికాక మంచినీటి సమస్య ఏర్పడిందని, గడ్డివలస గ్రామంలో హ్యాండిల్ బోరుకే మోటార్ అమర్చినప్పటికీ ట్యాంకు సదుపాయం ఏర్పాటు కాలేదని సీతంపేట గ్రామంలో కూడా ట్యాంకు నిర్మాణం పనులు నిలిచిపోయాయని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు గిరిజన గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలన చేసి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. మహిళా సంఘ నాయకురాలు వరాలు తదితరులున్నారు.



పనసభద్రలో నిరుపయోగంగా ఉన్న కుళాయిలను చూపిస్తున్న సీపీఎం నాయకుడు


● కర్రలే కంచెగా..



పార్వతీపురం సమీపంలోని వైకేఎం కాలనీ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కర్రలే కంచెగా నిలిచాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ విద్యుత్ శాఖాధికారులు కంచెను ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, చిన్నారులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా ఉండేలా స్థానికులే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కర్రలను అడ్డు పెట్టి కంచెను ఏర్పాటు చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– పార్వతీపురం రూరల్

మోసం చేయడం చంద్రబాబు నైజం



ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై ప్రజలకు వివరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

● మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం నైజంగా మారిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, సాలూరు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని గురువు నాయుడుపేట గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ పేరిట నిర్వహిస్తున్న మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు ష్యూరిటీ అని చెప్పి అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు గాలికి వదిలేసి కక్ష సాధింపు రాజకీయాలు చేస్తుందన్నారు. హామీ ఇచ్చి తరువాత ప్రజల్ని మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందన్నారు. తొలి అడుగు పేరిట ఇంటింటికి వెళ్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు ఇచ్చిన హామీలు గురించి ప్రజల ప్రశ్నిస్తే సంబంధం లేని మాటలు జవాబుగా చెబుతున్నారన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూరు శాతం హామీలు నెరవేర్చి తాము గడప గడపకు వెళ్లామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసంపై ప్రతి ఒక్క కార్యకర్త ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం గురువు నాయుడుపేట గ్రామంలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొర్ర జన్ని సింహాచలం, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, సర్పంచులు చింత సీతయ్య, బోను ధనుంజయ్, రామయ్య పలువురు ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రెల్లి, ఉప కులాలకు న్యాయం చేయాలి

పార్వతీపురం టౌన్:

ఎస్సీ ఏబీసీ వర్గీకరణలో రెల్లి వాటి ఉప కులాలకు సమాన న్యాయం చేయాలని రెల్లి వాటి ఉపకులాల ఉత్తరాంధ్ర జిల్లా కన్వీనర్ గండి డేనియల్ కోరారు. ఈ మేరకు సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయలకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రెల్లి వాటి ఉప కులాల వారికి రిజర్వేషన్ శాతం పెంచాలని ఉత్తరాంధ్ర జిల్లాలో మాల మాదిగలతో రెల్లిలు సమానంగా ఉన్నారన్నారు. ఒక్క శాతం రిజర్వేషన్ చాలదని, సుప్రీంకోర్టు వారి సూచనల ప్రకారం రెల్లి వాటి ఉప కులాల వెనుకబాటుతనాన్ని బట్టి రిజర్వేషన్ శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. రెల్లిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. నామినేటెడ్ పోస్టులు రెల్లిలకు ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం వారు దళితులను వర్గీకరించి ఒక శాతం రిజర్వేషన్ కల్పించారు. రెల్లి వారి ఉప కులాల జనాభా రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షలకు పైగా ఉన్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గండికుమార్ మాస్టర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సాండి సంజీవి, జిల్లా రెల్లి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గరుగుబిల్లి:

పార్వతీపురం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీ పీఆర్(పంచాయతీరాజ్) మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక శనివారం జరగనుందని ఆ సంఘ తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఎస్.అర్జునరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, ఆ షెడ్యూల్ ప్రకారమే ఎన్నికల నిర్వహణ ఉంటుందన్నారు. జూలై 13న ఉదయం 9 గంటలకు నామినేషన్లు స్వీకరణ, ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహణ ఉంటుందన్నారు. పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, మండలాల పీఆర్ ఎంప్లాయిస్ మినిస్టీరియల్ సిబ్బంది అంతా ఎన్నికల్లో పాల్గొనాలన్నారు.

అవగాహనతోనే వ్యాధుల దూరం



మాట్లాడుతున్న నీడ్ సంస్థ ప్రతినిధి

పాచిపెంట: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పాచిపెంట వేణుగోపాలరావు అన్నారు. మండలంలో నీలమ్మవలస, భీమన్న దొరవలస, పనసలపాడు గ్రామాల్లో వ్యాధులపై గిరిజనులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో డెంగీ, మలేరియా ప్రబలకుండా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అవసరమన్నారు. ప్రతీ ఒక్కరూ దోమతెరలు వాడటం వలన మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆ వ్యాధులు ఏ విధంగా సంక్రమిస్తాయో గిరిజనులకు వివరించారు. అవగాహన సదస్సులో హెల్త్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, ఏఎన్ఎం నీడ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎగువకాశాయవలసను సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి



గిరిజనులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్దన్

సాలూరు: మండలంలోని కురుకుట్టి పంచాయతీ ఎగువకాశాయవలస గ్రామాన్ని జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్దన్ శనివారం సందర్శించారు. గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కూనేటి శ్యామల అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో కుటుంబీకులు, బంధువులు ఆమెను డోలీలో తీసుకువచ్చిన సంఘటనపై ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పందించింది. డోలీలో ఆమెను కొండలు, గుట్టలు దాటుకుంటూ కురుకుట్టి తీసుకువచ్చి, అక్కడ నుంచి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించిన సంఘటనపై సాక్షితో పాటు పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పందించి గిరి శిఖర గ్రామాల్లో వాస్తవ పరిస్థితులపై వాస్తవ నివేదికను అందించాలని జూనియర్ సివిల్ జడ్జిను ఆదేశించారు. ఈ మేరకు సివిల్ జడ్జి కరడవలస వరకు వాహనంలో వెళ్లి అక్కడ నుంచి రెండు కిలోమీటర్లు మేర కాలినడకన ఎగువకాశాయవలసకు చేరారు. ఆశా కార్యకర్త శ్యామలతో పాటు గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరడావలసలో కంటెయినర్ ఆసుపత్రిను పరిశీలించారు.

అవగాహన ర్యాలీ

భామిని: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రాజెక్ట్ డాల్ఫిన్ పేరిట శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నదీ జలాలు - సముద్ర జలాల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యమంలో భాగంగా ప్రాజెక్ట్ డాల్ఫిన్ ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు ఈఎంఆర్ఎస్ ప్రిన్స్‌పాల్ జి.గంగాదేవి తెలిపారు. ముందుగా విద్యార్థులకు డాల్ఫిన్ జీవిత విశేషాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు